తెరుచుకోని ఆధార్ కేంద్రం

- నెల రోజులుగా ఇబ్బందులు పడుతున్న ఎల్లారెడ్డి ప్రజలు
- పట్టించుకోని యంత్రాంగం



ఎల్లారెడ్డిలో మూసి ఉన్న ఆధార్ కేంద్రం



బ్యాంకు ఎదుట ఆధార్ అప్‌డేట్ కోసం పడిగాపులు కాస్తున్న స్థానికులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రతి పనికి ఆధార్ తప్పనిసరిగా మారడంతో జనాలు ఆధార్ అప్‌డేట్ కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆధార్ కేంద్రం నెల రోజులుగా తెరుచుకోకపోవడంతో చుట్టు పక్కల గ్రామాలు, మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ఎస్‌బీఐ బ్యాంకులో మరో ఆధార్ కేంద్రం ఉండగా అది సైతం ఐదు రోజులుగా పని చేయకపోవడంతో జనాలకు ఇక్కట్లు మొదలయ్యాయి. ఎల్లారెడ్డితో పాటు లింగంపేట, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్ మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో 50 కిలోమీటర్ల దూరంలో జిల్లా కేంద్రానికి వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తున్నదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

ప్రతి పనికి ఆధార్ లింక్..

ప్రతి పనికి ఆధార్ లింక్ కావడంతో జనాలు ఆధార్ లింక్ లేక దానిని అప్‌డేట్ చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు ఖాతా ఓపెన్ చేయడం, రేషన్ కోసం ఈ–కేవైసీకి వేలి ముద్రల అప్‌డేట్ తదితర వాటికి సంబంధించి ఆధార్ లింక్‌గా ఉండడంతో రోజుల తరబడి ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కేంద్రం త్వరలోనే తెరుచుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పది రోజులుగా తిరుగుతున్నా..



పది రోజులుగా ఆధార్ కేంద్రానికి వస్తూ పోతున్నా. అది తెరుచుకోకపోవడంతో బ్యాంకు దగ్గర ఉన్నదని అక్కడికి వెళ్తే అది కూడా పని చేయడం లేదు. దీంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆధార్ కేంద్రాన్ని త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలి.

– శంకరయ్య, మౌలాన్‌ఖేడ్

కామారెడ్డికి వెళ్లాల్సి వస్తోంది



ఎల్లారెడ్డిలో ఆధార్ కేంద్రం పని చేయకపోవడంతో కామారెడ్డికి వెళ్లాల్సి వస్తున్నది. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది. చిన్న పనికి కూడా ఆర్థికంగా తమపై పెను భారం పడుతోంది. ఆధార్ కేంద్రం తొందరగా పని చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– హన్మాండ్లు, వెల్లుట్లపేట

త్వరలోనే చర్యలు తీసుకుంటాం

ఎల్లారెడ్డిలో ఆధార్ కేంద్రం పని చేయకపోవడంతో జనాలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ఆధార్ కేంద్రం త్వరలోనే పని చేసేలా చర్యలు తీసుకుంటాం. ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– భైరవ ప్రసాద్, మీ–సేవ మేనేజర్, కామారెడ్డి

ఆధార్ కేంద్రాన్ని తెరిపించాలని ధర్నా

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో నెల రోజులుగా ఆధార్ కేంద్రం మూసి ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వెంటనే తెరిపించాలని కోరుతూ స్థానికులు, బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు.



ఎల్లారెడ్డిలో తహసీల్ వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు

ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

మాచారెడ్డి: అమరుల త్యాగాలను గుర్తు చేయడానికి బీజేపీ చేపట్టిన మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణా రెడ్డి కోరారు. శుక్రవారం మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని గజ్యానాయక్ తండా, ఘన్‌పూర్, రాజఖాన్‌పేట, కాకులగుట్టతండా, లచ్చాపేట, భవానిపేట, భవానిపేట తండా, ఆరేపల్లి గ్రామాల్లో అమరుల జ్ఞాపకార్థం నిర్మించనున్న స్మృతివనం కోసం మట్టిని సేకరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షుడు నరసింహాచారి, తదితరులున్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్, కన్‌కల్ గ్రామాల్లో శుక్రవారం తపాల శాఖ ఆజాదీకా అమృత్ మహోత్సవాలలో భాగంగా మేరీ మాటీ –మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధుల ఇళ్లకు వెళ్లి వారి వారసుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారు నివసించిన ప్రదేశాలలో మట్టిని సేకరించారు. తపాల శాఖ అధికారులు శ్రావణ్ కుమార్, మహబూబ్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సురేష్, నర్సారెడ్డి, ప్రతాపరెడ్డి, పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న వెంకటరమణా రెడ్డి

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో మేరా మాటీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్నూర్‌కి చెందిన స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలైన మాజీ ఎమ్మెల్యే తమ్మెవార్ నాగ్‌నాథ్ సేట్ వారసులు తమ్మెవార్ రమేశ్, తమ్మెవార్ శోభ, విజయలక్ష్మీలను సర్పంచ్ సురేష్ ఘనంగా సత్కరించారు. అనంతరం వారి ఇళ్ల నుంచి మట్టిని సేకరించారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



బాన్సువాడ : బీర్కూర్ మండలం కిష్టాపూర్‌కు చెందిన పలువురు బీజేపీ కార్యకర్తలు శుక్రవారం మాజీ జెడ్పీటీసీ ద్రోణవల్లి సతీష్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు సతీష్ తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్‌లో గుర్తింపు లభిస్తుందని అన్నారు. సర్పంచ్ పుల్లెని బాపురావు, తదితరులు ఉన్నారు.

రైతుల అభివృద్ధికి పెద్దపీట

మద్నూర్(జుక్కల్): రైతుల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మద్నూర్ సహకార సంఘం చైర్మన్ శ్రీనుపటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో జరిగిన 53వ మహాజన సభలో ఆయన మాట్లాడారు.

ఆర్టీసీ బస్సులతో ట్రాఫిక్‌కు అంతరాయం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట బస్టాండ్ సమీపంలో ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సుల కారణంగా నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయమేర్పడుతోంది. బస్సులు బస్టాండ్‌లోనికి వెళ్లకుండా ప్రధాన రహదారిపైనే నిలపడం వల్ల ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇటీవలే బస్టాండ్‌లోనికి వెళ్లే రోడ్డును రూ.లక్షలు వెచ్చించి సీసీగా మార్చారు. అయినా ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను బస్టాండ్‌లోనికి తీసుకెళ్లకుండా ప్రధాన రహదారిపైనే నిలుపుతున్నారు. దీనివల్ల ప్రయాణీకులు ఇబ్బందులు పడటంతోపాటు ఇతర వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుంది.

రాష్ట్రస్థాయి పోటీలకు మైనారిటీ విద్యార్థుల ఎంపిక



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు నిజామాబాద్‌లో నిర్వహించిన పోటీలలో ఎల్లారెడ్డికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో 200 మీటర్ల రన్నింగ్‌లో మూసా ప్రథమ బహుమతి, అండర్–14 విభాగం చెస్‌లో అనస్ ద్వితీయ బహుమతి, అండర్–17 విభాగం 1500 మీటర్ల రన్నింగ్‌లో చంద్రసింగ్ ద్వితీయ బహుమతి, వాలీబాల్‌లో సూఫియాన్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు.

సమాచారం..

నేడు అడ్లూర్‌ఎల్లారెడ్డికి జిల్లా జడ్జి రాక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామంలో శనివారం నిర్వహించే సాగు చట్టాల అవగాహన సదస్సుకు జిల్లా జడ్జి శ్రీదేవి హాజరవుతారని ఏఈవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశాన్ని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

లబాన్ సమాజ్ శాంతియుత ర్యాలీ

కామారెడ్డి టౌన్: లబాన్ లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ నేడు జిల్లా కేంద్రంలో 20 వేల మందితో పెద్ద ఎత్తున శాంతియుత ర్యాలీ చేపడుతున్నట్లు లబాన సమాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాన్ సింగ్ నాయక్ తెలిపారు. ఇప్పటికైనా తమను ఎస్టీ జాబితాలో చేర్చి 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాయితి లంబాడీలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ కొప్పుల రవి

రాజంపేట: బాల్య వివాహాలపై సాధన సంస్థ, ఏహెచ్‌టీయూ, షిటీం ఆధ్వర్యంలో శుక్రవారం రాజంపేట కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన సంస్థ కో–ఆర్డినేటర్ కొప్పుల రవి మాట్లాడుతూ..యాక్సిస్ టు జస్టిస్ ఫర్ ఆల్ ప్రొగ్రాంలో భాగంగా బాల్యవివాహాలు లేని భారత దేశాన్ని నిర్మించడం కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే సాధన సంస్థ వారిని సంప్రదించాలని అలాగే పిల్లలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణా, వెట్టిచాకిరీ, తప్పిపోయిన పిల్లలు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు కనపడినట్టైతే హెల్ప్ లైన్ 1098తో పాటు, 18001027222 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. సైబర్ క్రైం గురించి షి టీం కానిస్టేబుల్ భూమయ్య మాట్లాడారు. మీకు ఎటువంటి సమస్యలు ఎదురైన 100కి ఫోన్ చేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలన కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సాధన సంస్థ కమ్యూనిటీ కౌన్సెలర్లు రవళి, సంగీత, షి టీం కానిస్టేబుల్స్ భూమయ్య, సౌజన్య, ఏహెచ్‌టీయూ కానిస్టేబుల్ రాజేందర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి పాల్గొన్నారు.

బస్సులను సర్వీస్ రోడ్డు మీదుగా నడపాలి



తిమ్మోజీవాడి-దగ్గి చౌరస్తా వద్ద బస్సులను సర్వీస్ రోడ్డు మీదుగా పంపిస్తున్న గ్రామస్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తిమ్మోజీవాడి–దగ్గి చౌరస్తా వద్ద నుంచి ఆర్టీసీ బస్సులను ఇరువైపులా గల సర్వీస్ రోడ్డు మీదుగా తీసుకెళ్లాలని ఇరు గ్రామాల సర్పంచ్‌లు పొన్న స్వప్న శంకర్, సుందరమ్మలు పేర్కొన్నారు. ఈ విషయమై కామారెడ్డి డిపో మేనేజర్‌కు విన్నవించినట్లు తెలిపారు. కామారెడ్డి వైపు నుంచి నిజామాబాద్ వైపునకు, నిజామాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపునకు వెళ్లే ఆర్టీసీ బస్సులను సర్వీస్ రోడ్డు మీదుగా తీసుకెళ్లాలని కోరారు. ప్రస్తుతం నిజామాబాద్ వైపునకు వెళ్లే బస్సులను మాత్రమే సర్వీస్ రోడ్డు మీదుగా తీసుకెళ్తున్నారని, నిజామాబాద్ వైపు నుంచి కామారెడ్డికి వచ్చే ఆర్టీసీ బస్సులను సర్వీస్ రోడ్డు గుండా తీసుకెళ్లడం లేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఉప సర్పంచ్ సాకలి రాజన్న, ఎంపీటీసీ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారాల ఏర్పాటుకు రుణాలు



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): ప్రధామంత్రి కిసాన్ పథకం కింద కోళ్ల ఫారాల ఏర్పాటుకు రూ.25 లక్షల చొప్పున రుణాలు ఇవ్వనున్నట్లు అచ్చంపేట సొసైటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మల్లూర్ సొసైటీ చైర్మన్ ఒంటరి కల్యాణి అన్నారు. శుక్రవారం అచ్చంపేట, మల్లూర్ గ్రామాల్లో సహకార సంఘాల మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు డబ్బులు సకాలంలో చెల్లించాలని కోరారు. సహకార సంఘాల ఆధ్వర్యంలో పంట రుణాలు పొందిన రైతులందరి రుణాలు వందశాతం మేర మాఫీ చేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, గైని విఠల్, విఠల్‌రెడ్డి, మనోహర్, సత్యనారాయణ తదితరులున్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి



ఫిర్యాదు చేస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు

కామారెడ్డి అర్బన్: పాల్వంచ మండలం ఫరీదుపేట సర్పంచ్ ఆశం భాగ్యమ్మ రూ.15 లక్షల అవినీతికి పాల్పడి సస్పెండై స్టే ద్వారా పదవిలో కొనసాగుతున్నందున అవినీతి సొమ్మును వెంటనే రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బి.బాల్‌రాజ్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కుమారుడు దీపక్‌గౌడ్ వార్డు సభ్యులను లెక్కచేయకుండా అన్ని నేనే చేస్తా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని అంటున్నారని, అవినీతిపై వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అసైన్డ్ భూములకు పంట రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

బీబీపేట: ప్రభుత్వం అసైన్డ్ భూములకు సైతం పంట రుణాలు ఇవ్వాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి కోరారు. శుక్రవారం ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం వార్షిక నివేదిక మహాజన సభలో రైతులతో కలిసి రుణాలివ్వాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీలో ఈ ఏడాది సంబంధించిన ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. రాబోయే సంవత్సరానికి అంచనా విలువలను చదివారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి



సాక్షి నెట్‌వర్క్: కనీస వేతనం రూ.18 వేలు చెల్లించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. వారు చేపట్టిన సమ్మె శుక్రవారానికి ఐదవ రోజుకు చేరింది. మండల కేంద్రాల్లో తహసీల్ కార్యాలయాల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. పలువురు మద్దతు ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పనిభారం తగ్గించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, అర్హత కలిగిన ఆశాలకు ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం ప్రమోషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



మద్నూర్(జుక్కల్): అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వినోద్ వివరించారు. మండల కేంద్రంలోని సాక్షర స్కూల్‌లో శుక్రవారం ఫైర్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎలా రక్షించుకోవాలో విన్యాసాల ద్వారా వివరించారు. విపత్తు నిర్వహణలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో చేపట్టే సేవల గురించి ప్రదర్శన ద్వారా వివరించారు. ఫైర్ సిబ్బంది రాజేందర్, పాఠశాల చైర్మన్ సందీప్, ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు తదితరులున్నారు.

క్లుప్తంగా

విద్యాశాఖ మంత్రిని కలిసిన జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు



కామారెడ్డి టౌన్: విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం విద్యా శాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డిని హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీఎం క్యాబినెట్ సమావేశంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల అంశాన్ని చర్చించి న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, తదితరులున్నారు.

ఎల్‌వోసీ అందజేత



కామారెడ్డి క్రైం: దోమకొండలోని పనుగట్లకాలనీకి చెందిన లింగం అనే వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన కుటుంబ సభ్యులు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ను సంప్రదించగా మెరుగైన వైద్యం అందించడానికి రూ.8 లక్షల ఎల్‌వోసీని ప్రభుత్వం నుంచి మంజూరు చేయించారు. హైద్రాబాద్‌లో శుక్రవారం బాధితుని కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీని అందజేశారు.

నియామకం



భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ కులస్తులు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూరిగారి బాబాగౌడ్, కోశాధికారిగా కాశగొని స్వామిగౌడ్, అకౌంటెంట్‌గా లింగంపేట శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఎన్నికయ్యారు.

ఆడిట్ సమావేశం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మెడెగాంలో శుక్రవారం ఉపాధి హామీ ఆడిట్ సమావేశం నిర్వహించారు. జూలై 1. 2021 నుంచి మార్చి 31, 2023 వరకు గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి చేపట్టిన పనులను ప్రజలకు వివరించారు. సర్పంచ్ తిరుమల, ఉప సర్పంచ్ మాచెర్ల రాజులు, ఎంపీటీసీ జూకంటి సుజాత బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పిట్లం(జుక్కల్): బాలింతలు, గర్భిణులు ప్రతిరోజు పోషకాహారం తీసుకోవాలని, అది వారికి ఎంతో శ్రేయస్కరమని ఎంపీడీవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన శుక్రవారం గొద్మెగాం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు.అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు హరికిషన్‌రావు 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్, సభ్యులు కాశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

బిచ్కుంద(జుక్కల్): మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం దౌల్తాపూర్‌లో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, ఎంపీపీ అశోక్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ భాస్కరన్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా జీవాలకు టీకాలు వేయించాలని సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు వెంటక్‌రావు, హన్మంత్‌రావు, సిబ్బంది సాయిలు, మహేష్ పాల్గొన్నారు.

బీడీ కార్మికుల కోసం స్థలం కేటాయింపు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెదగేట్ వద్దనున్న సర్వే నం–39లో బీడీ కార్మికుల కోసం 2 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ మేరకు శుక్రవారం గ్రామానికి చెందిన పలువురు నాయకులతో కలిసి అధికారులు బీడీ కార్మికుల కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించి సర్వే చేయించారు. మాల్తుమ్మెద ఎంపీటీసీ నారాయణ, పీఆర్ ఏఈ పిచ్చయ్య, ట్రాన్స్‌కో ఏఈ మనోరంజన్, సర్వేయర్ అభిలాష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

మురికి కాలువ నిర్మాణానికి భూమిపూజ

నిజాంసాగర్(జుక్కల్): అచ్చంపేట జీపీలో మురికి కాలువల నిర్మాణానికి శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు భూమిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పిట్ల అనుసూయ, బీఆర్‌ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, గైని విఠల్, నర్సింహారెడ్డి, రమేష్‌కుమార్ ఉన్నారు.

పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రైతులు సొసైటీలో తీసుకున్న పంట రుణాలను ఏక కాలంలో మాఫీ చేయాలని డైరెక్టర్లు తీర్మానం చేశారు. శుక్రవారం ఎల్లారెడ్డి సొసైటీలో చైర్మన్ నర్సింలు అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. డైరెక్టర్లు, కార్యదర్శి విశ్వనాథం తదితరులున్నారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యల్ని పరిష్కరించాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎండీఎం నిర్వాహకులు శుక్రవారం ఎంపీపీ మాధవికి వినతిపత్రం అందించారు. పెంచిన వేతనాలను ఏప్రిల్ నుంచి అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఎండీఎం చార్జీలను పెంచాలని కోరారు. నిర్వాహకులు సాయిలు, దుర్గవ్వ తదితరులున్నారు.

కామారెడ్డిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

కామారెడ్డి టౌన్: మున్సిపల్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ముందు ముగ్గుల పోటీలను, పాఠశాలలు, ప్రభుత్వ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మున్సిపల్ కమిషనర్ దేవేందర్ పరిశీలించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు రవీందర్, పర్వేజ్ తదితరులున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

మద్నూర్(జుక్కల్): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం కాంగ్రెస్ యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని రోగులకు పండ్లు, బ్రెడ్‌లను కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలు షిండే పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో జుక్కల్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని అన్నారు.

అక్టోబర్ 2న గ్రామసభలు నిర్వహించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2న అన్ని జీపీలో గ్రామసభలు నిర్వహించాలని ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో శుక్రవారం ఎంపీవో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫ్లెక్సీలతో నిర్వహించిన కార్యక్రమాల ఫొటోలను సంబంధిత గ్రూప్ లలో అప్‌లోడ్ చేయాలన్నారు.

సహకార సంఘాలు రైతులకు అండగా ఉంటాయి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): సహకార సంఘాలు రైతులకు అండగా ఉంటాయని, రైతుల సమస్యలను పరిష్కరించడంలో సంఘాల తరపున తాము కృషి చేస్తామని మాల్తుమ్మెద, తాండూర్ సహకార సంఘాల చైర్మన్లు నర్సింలు, గంగారెడ్డి సూచించారు. మాల్తుమ్మెద, తాండూర్ సహకార సంఘాలలో శుక్రవారం మహాజన సభలను నిర్వహించారు. సీఈవోలు పవన్, జైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు ఎంఆర్ కిట్ల పంపిణీ

గాంధారి(ఎల్లారెడ్డి): స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు ఎంఆర్ కిట్లను శుక్రవారం ఎంఈవో సేవులా పంపిణీ చేశారు. డాక్టర్ సారిక దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపి చేశారు. రీసోర్స్ టీచర్లు పెంటయ్య, సాయిలు ఉన్నారు.